క్లుప్తంగా

హక్కులకు మూలం స్వేచ్ఛ, సమానత్వం



కార్యక్రమంలో పాల్గొన్న పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి

మల్కాపురం: వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే హక్కులు సొంతం కావాలంటే ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, స్వాతంత్య్రం, సమానత్వం ఎంతో అవసరమని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పత్రికా స్వేచ్ఛ గురించి విద్యార్థులకు వివరించారు. స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. కార్యక్రమంలో చిన్నారులకు చిత్రలేఖనంపై తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి పైడిమాంబకాలనీలో అభివృద్ధి పనులకు జోన్–5 ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి నేతృత్వంలో శనివారం వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.48 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ ఉషారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురుమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ, పారామెడికల్, నర్సింగ్, ఎంఎల్టీ, బీపీటీ, కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలకునే విద్యార్థులు 7995013421, 7995013422 నంబర్లలలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వెనుక నున్న బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు కూటమి మోసం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెందుర్తి: ఎన్నికల సమయంలో దేశ వ్యాప్తంగా 2 కోట్ల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దారుణంగా మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు విమర్శించారు. తిరుపతి కేంద్రంగా ఈ నెల 15 నుంచి 18 వరకు జరగున్న ఎఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ శనివారం బర్ధన్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటులో ఏ మాత్రం భాగస్వామ్యం లేని బీజేపీ ఇప్పుడు ఏకంగా దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో అనేక హామీ ఇచ్చి ప్రజలను దారుణంగా వంచించిందన్నారు. మహాసభల వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేసిన తీరుపై చర్చించి ప్రణాళికబద్ధంగా పోరాటం చేస్తామని చెప్పారు. ముందుగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ నాయకులు పవన్, సాయి,రాజు, రాజేష్, హరీష్ పాల్గొన్నారు.



పార్కులో పిల్లల సందడి



వ్యాయామం చేస్తున్న మహిళలు

ఆ హ్లాదం / రోగ్యం / నందం

పంచతత్వ పార్కు సొంతం

ఆయుర్వేద వనాలతో ఆహ్లాదకర వాతావరణం

గత ప్రభుత్వంలో పార్కు అభివృద్ధి

సంరక్షణకు నడుంబిగించిన కాలనీ వాసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆనుకొని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కు పశ్చిమ నియోజకవర్గంలో రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. చుట్టు పక్కల కాలనీ వాసులకు ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాటు చేశారు. రకరకాల ఆయుర్వేద మొక్కలు పెంచడంతో ప్రత్యేకత సంతరించుకుంది. దీనికి 'పంచతత్వ పార్కు' అని పేరు పెట్టారు. పార్కు సంరక్షణకు సైతం కాలనీ వాసులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రజానీకానికి ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పంచుతుండడంతో పార్కుకు వస్తున్న సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.



పచ్చని గ్రీనరీ మధ్య వాకింగ్ ట్రాక్



90వ వార్డులోని పంచతత్వ పార్కు

ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పార్కు ఉదయం, సాయంత్రం వేళల్లో సందడిగా మారుతోంది. మహిళలు వ్యాయామం చేసుకునేందుకు తగిన పరికరాలు ఏర్పాటు చేయటంతో దీనిపై మరింత ఆసక్తిని పెంచుతోంది. బ్యాడ్మింటన్ కోర్టు, పిల్లలకు జారుడుబల్లలు కూడా అందుబాటులో ఉండటంతో పిల్లలు, పెద్దలతో పార్కు సందడిగా కనిపిస్తోంది.

సంరక్షణకు మేము సైతం

పంచతత్వ పార్కులో ఔషధ మొక్కలు ఎక్కువగా పెంచుతుండడంతో వీటి సంరక్షణకు కాలనీ వాసులు సైతం మేము సైతం అంటూ ముందుకొచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ రోజూ మొక్కలకు నీరు పట్టేలా ఓ వ్యక్తిని ఏర్పాటు చేశారు. దీంతో మండుటెండల్లోనూ పార్కు పచ్చదనంతో కళ కళలాడుతోంది.



పార్కులో మొక్కలకు నీరు పెడుతున్న సిబ్బంది

రూ.46.80 లక్షలతో అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విశాఖ నగరంలో పార్కుల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత కార్పొరేటర్ రమణ చొరవతో నగర పాలక సంస్థ ఉద్యాన వన విభాగం ద్వారా రూ.15 లక్షలతో వనమూలికల మొక్కల పెంపకం, పార్కులో ఫౌంటైన్ వంటి పనులు చేపట్టారు. రూ.12 లక్షలతో పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్, మరో రూ.19.8 లక్షలతో పార్కులో జిమ్, కాంపౌండ్ వాల్ ఎత్తులో భాగంగా గ్రిల్స్ వంటివి ఏర్పాటు చేశారు. మొత్తంగా రూ.46.80 లక్షలతో పంచతత్వ పార్కును అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న పిల్లలు

విద్యుత్ కాంతులు.. అదనపు హంగులు

90వ వార్డు పరిధిలోని సుసర్లకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, బుచ్చిరాజుపాలెం, అల్లూరి సీతారామరాజు కాలనీల నుంచి పంచతత్వ పార్కుకు వచ్చే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతుండడంతో ఇక్కడ అదనపు హంగులు కల్పించారు. రాత్రి 8 గం.ల వరకు పార్కును వినియోగించుకునేలా జీవీఎంసీ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లు అమర్చారు. ఔషధ మొక్కల మధ్య వాకింగ్ ట్రాక్ ఉండటంతో పరిశుభ్రమైన గాలిని పీల్చుతూ వృద్ధులు సైతం పార్కును వినియోగించుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.



విద్యుత్ స్తంభాలు అమర్చుతున్న సిబ్బంది

చెట్ల కొమ్మలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: విద్యుత్ శాఖ అధికారులు తొలగించి పడేసిన చెట్ల కొమ్మలను శనివారం తొలగించారు. 'ఈ వ్యర్థాలకు బాధ్యులెవరు...?'అన్న శీర్షికతో శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్ ఎక్కడికక్కడ పడేసిన చెట్ల కొమ్మలను ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి తరలించారు. గతంలో వీటిని వదిలేయడంతో జీవీఎంసీ సిబ్బంది తొలగించేవారు. దీని వల్ల కాంట్రాక్టర్‌కు వాహన, కూలీల ఖర్చు ఉండేది కాదు. వాటిని మిగుల్చుకునేందుకు అధికారులు సైతం వీరికి వంత పడేవారు. ఈ వ్యర్థాలను తొలగించడం ఆలస్యమైతే స్థానికులు ఇబ్బందులు పడేవారు. జీవీఎంసీ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ఇపుడు వెంటనే తొలగించడంతో ఇబ్బందులు తప్పాయని స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



చెట్ల కొమ్మలను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలపై 'ఖాళీ ప్లేసే మా బార్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రౌండ్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే గణబాబు శనివారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడా మైదానాన్ని అన్ని వర్గాల వారికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గ్రౌండ్‌లో ఊటనీరు రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దీని కోసం రూ.49.40 లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రూ.34లక్షలతో వాకింగ్ ట్రాక్, లైటింగ్, గేటు, కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తారని, రూ.43.15లక్షలతో క్రికెట్ నెట్ ప్రాక్టీస్, ఓపెన్ జిమ్, వాలీబాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శిథిలావస్థకు చేరుతున్న ఇక్కడి మండపాన్ని తొలగించాలని ఆదేశించారు. గ్రౌండ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, వాచ్‌మెన్‌ను కూడా నియమిస్తామని చెప్పారు. ఈఈ దిలీప్ కుమార్, ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న పనులు

వాటర్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతి



ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో పాత చెక్‌పోస్టు ఏరియా ప్రాంతంలో తమ ఇంటికి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాగా అతడి మానసిక స్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శరగడం ప్రసాద్‌రెడ్డి (35) చెల్లితో కలిసి స్థానికంగా ఉంటున్నాడు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో రోడ్లపై తిరుగుతాడు. ఎవరు ఏది ఇచ్చినా స్వీకరించి వెళ్లిపోతాడు. అయితే శనివారం సాయంత్రం ఇంటికి ఆనుకుని ఉన్న వాటర్ ట్యాంక్(రిజర్వాయర్) రక్షణ గోడ ఎక్కి వెళ్లాడు. ట్యాంకుకు మూత లేక పోవడంతో చూస్తుండాగానో.. మరి ప్రమాదవశాత్తు జారి పడిపోయాడో తెలియదు. అయితే సమయం గడుస్తున్నా అన్న ఇంటికి రాకపోవడంతో చెల్లెలు చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. వారు వెళ్లి ట్యాంకు వద్ద చూడగా లోపల ఉన్నాడు. వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చిన తర్వాత మృత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

వాటర్ సప్లై సిబ్బంది నిర్లక్ష్యం

పాత చెక్‌పోస్టు ఏరియాలోని అన్నక్యాంటీన్ వెనుక ఉన్న ఈ వాటర్ ట్యాంకు నుంచే పరిసర ప్రాంతాలకు మంచినీరు సరఫరా చేస్తారు. అలాంటి ట్యాంకు నిర్వహణలో వాటర్ సప్లై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. నీరు నింపిన తర్వాత ట్యాంకు మూత అమర్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూత ఏర్పాటు చేయడంతో పాటు అటువైపు ఎవరూ వెళ్లకుండా సెక్యూరిటీ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వాటర్ ట్యాంక్‌లో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

అరకొర వేతనాలతో అవస్థలు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగారంలో అరకొర వేతనాలు చెల్లిస్తున్నారని స్టీల్ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న దీక్షశిబిరాన్ని శనివారం సీఐటీయూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జె. సింహాచలం మాట్లాడుతూ కర్మాగారంలో లేబర్ కోడ్స్ అమలు చేయడానికి యాజమాన్య ప్రయత్న చేస్తుందని ఆరోపించారు. దీనిలో భాగంగానే ఉన్న వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వాటిపై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే క్రమశిక్షణ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామారావు,వెంకటేశ్వరరావు,అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షశిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

బోరు బావి వద్ద వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగించిన అనంతరం బోరుబావి

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని ఆర్‌కే పురం నుంచి సెయింట్ జోసెఫ్ పాఠశాలకు వెళ్లే మార్గంలో గల బోరుబావి వద్ద వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బంది శనివారం తొలగించారు. ఇక్కడ వ్యర్థాలను నిర్లక్ష్యంగా డంప్ చేయడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో 'ఇదేం చెత్త పని' శీర్షికతో శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం అధికారులు తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి, వ్యర్థాలను తొలగింపజేశారు. అనంతరం బోరు నిర్వహణలో ఉందా లేదా అని పరిశీలించారు. బోరు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, రీ బోరు పనులను చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు వివరించారు.

సమ్మె నోటీసు అందజేత



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి శనివారం అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. కార్మిక సమస్యలు, కార్మిక చట్టాలు మార్పు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు హయ్యర్ పెన్షన్ అమలు తదితర డిమాండ్లపై జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈనెల 20న సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ డిమాండ్లతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలన్న డిమాండ్‌పై సమ్మెలో పాల్గొంటామని ఉక్కు హెచ్‌ఆర్ జీఎం ఎం. మధుసూదనరావుకు అందజేసిన నోటీసులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు సమ్మి రమ, కె. వంశీ, ఆనంద్, నాగరాజు, పి. గుర్నాథ్, సమ్మె చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు పెద్ద సంఖ్యలో కోడెదూడల సమర్పణ



భక్తులు సమర్పించిన కోడెదూడలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు కోడెదూడలు మొక్కుబడిగా చెల్లించారు. కొండదిగువ తొలిపావంచావద్ద వాటిని స్వామికి సమర్పించి వదిలి వెళ్లారు. దాదాపు 150 వరకు కోడెదూడలను స్వామికి సమర్పించారు. కాగా వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు పూచీకత్తుపై ఇచ్చేబాధ్యతను నగరానిగి చెందిన హోప్ యానిమల్ ట్రస్ట్ చేపట్టింది.

ఇంటక్‌తోనే కార్మికులకు మేలు



మాట్లాడుతున్న ఇంటక్ నాయకుడు భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఐఎన్‌టీయూసీ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో గుల్లలపాలెంలోని మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భోగవల్లి నాగభూషణం మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద ట్రేడ్ యూనియన్ ఐఎన్‌టీయూసీ అని వివరించారు.ఇంటక్ ద్వార దేశంలోని పలు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఎంతో మేలు జరిగిందని వివరించారు. కార్మిక వర్గం సంక్షేమానికి నిరంతరం ఇంటక్ పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్య నిర్వహణ అధ్యక్షుడు తాతబాబు,రాజేష్,రాజుయాదవ్,మజ్జి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద కేక్ కట్ చేస్తున్న

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో ప్రధాన గేటు వద్ద ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఐఎన్‌టీయూసీ, ఎన్‌ఏసీఈఅండ్ డబ్ల్యూ యూనియన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య కేక్ కట్‌చేసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ 1947 మే 3న మహాత్మా గాంధీజీ ఆశయాలతో స్థాపించడం జరిగిందన్నారు. నాటి నుంచి కార్మికుల హక్కులను రక్షించే విధంగా పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ అన్నారు. ఉక్కు హెచ్‌ఆర్‌డీ విభాగంలో శనివారం ఆయన అసోసియేషన్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అసోసియేషన్ పెద్ద సంఘంగా ఉండడం వల్ల కార్మికులతో పాటు అధికారులకు ఉపయోగకరమన్నారు. సభ్యుల సంక్షేమం, అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హెచ్‌ఆర్ జీఎంలు ఎం. మధుసూదనరావు, ఎన్. భాను మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా గతేడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సిల్వర్ కాయిన్లు అందజేశారు. విశ్రాంత జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుబు బి. అప్పారావు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాస్, వై.ఎల్. నాయుడు, వి. సింహాచలం, శశిభూషణరావు, దొడ్డి సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.



వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్, హెచ్‌ఆర్ జీఎం, నాయకులు

రామాలయంలో విశేషంగా హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో హోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీరారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు